# శాంతి

అరుణరాగ రంజితమైన ఆకాశం మనోహరంగా వుంది పశ్చిమదిశన. అల్లనల్లన వీచే పిల్లగాలులు పలుకరించడం వలన కాబోలు అల్లరిగా నుదుటిమీద నాట్యం చేశాయి ముంగురులు. గాలి తెరలు మోసుకొచ్చిన సౌరభాల్నిగానీ, సంధ్యరాగ శోభితమైన ప్రకృతి కాంత లావణ్యాన్ని గానీ, ఆస్వాదించి ఆనందించడం లేదు శశికళ!

లావాటి పుస్తకాన్ని గుండెలమీద పెట్టుకుని పడక కుర్చీలో వెనక్కి వాలి పరధ్యానంగా ఎటో చూస్తూ కూర్చున్న అందమైన శశికళ అప్రయత్నంగానే చిన్నగా నిట్టూర్చింది.

క్రిష్ణమోహన్ గుండె బాధగా మూల్గిందా నిట్టూర్పు గమనించి, చిన్నగా దగ్గాడతను తన వునికిని తెలియబరచుకుంటూ.

చటుక్కున తల తిప్పి చూసింది శశికళ. 'మీరా! ఎంతసేపయింది వచ్చి?' లేచి సరిగ్గా కూర్చుంటూ ప్రశ్నించింది.

'ఇప్పుడే... అయిదు నిముషాలయింది. ఏదో ఆలోచనలో వుంటే డిస్టర్బ్ చేయడమెందుకని పిలవలేదు.' అంతకు అయిదు నిముషాల ముందునుండి తను ఆమెను గమనిస్తున్న విషయం స్పష్టంచేస్తూ పిట్టగోడ దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు క్రిష్ణమోహన్.

కనులు క్రిందికి వాల్చుకుంది శశికళ. ఆమె సువిశాల దీర్ఘ నేత్రాలు అలా వాలిపోయినపుడు మరింత ఆకర్షణీయంగా కన్పిస్తుంది 'లాంగ్ సిల్కీ ఐ లాషెస్' తనలో తనే అనుకున్నాడు క్రిష్ణమోహన్. అంతలోనే అడిగాడామెను "మధు రాలేదా ఇంకా?"

ఆ ప్రశ్నతో తలెత్తింది శశికళ. 'వుహూ! ఇవ్వాళ లేట్‌గా వస్తానన్నాడు అన్నయ్య!' వినీ వినిపించనట్టు జవాబిచ్చింది.

నిర్లిప్తంగా స్తబ్ధంగావున్న ఆ పిల్లను ఎలాగైనా కవ్వించి నవ్వించి ఆ కనుల క్రింద తారాడే నీలి నీడలను దూరానికి పారద్రోలి ఆ స్థానే వుత్సాహాన్నీ, ఆనందాన్నీ నింపాలని బలమైన కోరిక లేచిందతనిలో, కానీ ఆమె గంభీరత అతన్ని దూరంలోనే నిలబెట్టింది. తనలో కలిగిన భావోద్వేగాన్ని అణచివేసుకుంటూ లాలనగా అడిగాడు క్రిష్ణమోహన్.

'ఎప్పుడూ ఇలా ఏకాంతంగా మూడీగా కూర్చోకపోతే కాస్త జాలీగా నలుగురిలో మసలడానికి ప్రయత్నించ వెందుకు శశీ?' లాలనలో వేదనకూడా ధ్వనించింది. ప్రార్థనా వినిపించింది.

'నాకింటరెస్ట్ లేదు మోహన్! మనుష్యులకూ నాకూ పొత్తు కుదరదు. నేనో పొట్ల చెట్టును! నాకీ ఒంటరితనమే యిష్టం!' లో గొంతుకతో అంది శశికళ.

'బాగుంది! మనుష్యుల మధ్య మసలేకంటే దేవతలతో స్నేహం కావాలా ఏం నీకు?' నవ్వడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

'ఎవరూ వద్దు! ఏమిటో జీవితమంటేనే విసుగ్గా వుంటుంది నాకు ఎందుకు పుట్టానో మరెందుకు బ్రతకాలో అర్థం కాదు... అసలు ఈ వాతావరణానికి దూరంగా ఏ ఆశ్రమంలోనో, సన్యాసినులలోనే చేరిపోవాలని వుంది.' విసుగ్గా మొదలు పెట్టిన శశికళ గొంతు జీరబోయింది. కళ్ళలో నీటిపొర కదలాడింది. చటుక్కున తల వంచుకుని పుస్తకం పేజీలు త్రిప్పసాగింది.

అధీరుడైపోయాడు క్రిష్ణమోహన్, ఆమె కన్నులలో చిందిన నీరు అతని హృదయాన్ని విలవిల లాడించింది. అర్థంలేని అసంతృప్తితో, విరక్తితో సతమతమ వుతున్న ఆమెను హృదయానికి హత్తుకుని ఓదార్చాలని మనసు మారాం చేసింది.

'ఎందుకీ విరక్తి శశీ? నీకేం తక్కువని? కోరినంత వరకు చదివావు. కావల్సినంత డబ్బు వుంది... నేనంటే కోపమొస్తుందేమో గానీ అసాధారణమైన అందం నీసొత్తు. కావాలన్నది కాదనకుండా అమర్చే అన్నయ్య వున్నాడు ఇంకేం తక్కువని ఈ నిరాశ. కుర్చీ నుండి లేచి ఆమె దగ్గరగా వచ్చి అనునయ స్వరంతో అడిగాడు. అప్పుడతని మానసిక కల్లోలం మాటల కందని స్థితిలో వుంది.

మోకాళ్ళలో తల దాచుకుంది శశికళ. "అవును అవన్నీ వున్నాయి ఆ సంగతి పదేపదే మీరు గుర్తు చేయకపోయినా నాకు తెలుసు! కానీ... కానీ... ఎందుకో ఏదో అసంతృప్తి, నిరాశ నన్ను కాల్చివేస్తున్నాయి. అన్ని వుండీ ఒక క్షణమైనా మానసిక శాంతిలేదు నాకు. నన్నర్థం చేసుకోలేరు మీరు... నా కెవ్వరూ లేరు... వుద్వేగంగా అంటూనే వెక్కి వెక్కి ఏడవసాగింది. ఎగసిపడుతున్న ఆమె వీపుమీద రెండు జడలూ వెక్కిళ్ళతోబాటు కదులుతున్నాయి.

'ఎలా అనగలిగావు శశీ... నీ కెవరూ లేరూ? నీ కోసం అహరహమూ తపించే వ్యక్తి ఎదుటే అంతమాట ఎంత తేలికగా అనేశావు? నీ మనసుకు శాంతి దొరుకుతుందంటే నా ప్రాణాన్నైనా తృణప్రాయంగా ఇవ్వగలను. నీ సంతోషం కోసం ఏం చేయాలన్నా సిద్ధమే... కానీ ఏ విధంగా నీకు శాంతి కలిగించడం? ఎలా నిన్ను సంతోషపెట్టడం?' రెండు చేతులూ క్రాపులోకి దూర్చి

తలవాల్చి కూర్చుండిపోయిన క్రిష్ణమోహన్ గుండెలో కొట్టుకులాడిన ఈ భావాలు మాటలరూపం దాల్చకముందే శశికళ అక్కడి నుండి లేచి పరుగున తన గదిలోకి వెళ్ళిపోయింది.

'క్రిష్ణా!' చల్లని స్పర్శ వీపుమీద సోకి చివాలున తలెత్తి చూశాడు క్రిష్ణమోహన్.

'అరె! ఏమిటలా వున్నావు? చెల్లాయేమన్నా అందా? ఏదీ ఎక్కడుంది శశి?' గాభరాగా ప్రశ్నించాడు మధుమూర్తి.

"ఏంలేదు మధూ! మీ చెల్లెలు నన్నేమీ అనలేదుగానీ ఇప్పుడామెను పలుకరించకు. అసలే బాధ పడుతుంది. పేలవంగా నవ్వి అన్నాడు మోహన్.

ఆపేక్షగా అతని భుజం తట్టాడు మధు! 'శశి నిన్నెందుకు కర్థం చేసుకోవడం లేదో నాకు తెలియడం లేదు అసలు దానికేం లోటుందని ఈ బాధ పడడం? కాలేజిలో చదివే రోజుల్లోనే నయం కాస్త! పుస్తకాలతోటీ, కాలేజికి వెళ్ళి రావడంతోనూ ఉత్సాహంగా వుండేది. ఈ మధ్యలోనే బొత్తిగా ఇలా తయారయింది!' విచారంగా అన్నాడు మధు.

ఏదో తోచినట్టు చటుక్కున సరిగ్గా లేచి కూర్చున్నాడు మోహన్. "అన్నీ అమర్చి పెట్టినా ఏ వ్యాపకం లేకపోవడంవలననే ఆవిడ కా అసంతృప్తి ఏర్పడిందేమో మధూ! కష్టమంటే ఏమిటో, పేదరికంలోని బాధ ఎటువంటిదో, కంటకావృతమైన మార్గంలో ఎంత మంది నవ్వుతూ పయనిస్తున్నారో ఆమెకు తెలియదు! అందుకే సర్వసౌఖ్యాలూ అందుబాటులో వున్నా ఏదో కొరతవున్నట్టు అసంతృప్తి కొని తెచ్చుకుంటూంది."

ఆవేశంగా అంటున్న క్రిష్ణమోహన్ మాటలను నివ్వెరపడి వింటున్న మధు ఇక ఆగలేకపోయాడు, 'ఇంతకూ నువ్వు అనేదేమిటి?'

'ఏమీలేదు మధూ! కొన్నాళ్ళపాటు ఆమెకు బయటి ప్రపంచంతో సంబంధం కల్పించు. వివిధ వ్యక్తులతో, వారి జీవితాలతో పరిచయం కలిగితే తానెంత వున్నతురాలైనదీ గ్రహిస్తుంది శశి. ఇదే ఆమెను మార్చే మార్గం మధూ!'

'అంటే?...' మధు ఏదో అనబోయాడు. 'అంటే శశిని కొన్నాళ్ళపాటు ఏదన్నా ఉద్యోగంలో ప్రవేశ పెట్టమంటున్నాను!' మోహన్ ఉద్వేగంగా అన్నాడు.

"అదేం మాట మోహన్? గతిలేనట్టు దానికి ఉద్యోగంచేసే కర్మేం? అయినా నలుగురూ నన్నుచూసి నవ్వరూ? చెల్లెలి సంపాదన కోసం...

'సరే! నలుగురి మాటకోసం చెల్లెలు జీవితం ఎలా నాశనమయినా భరిస్తావన్నమాట?' కోపంగా అడ్డుకున్నాడు మోహన్.

'కానీ శశి తట్టుకోగలదా అసలు? అమాయకురాలు కూడా..." మధు సందేహించాడు.

"ప్లీజ్! మధూ! నామాటమీద నీ కేమాత్రం గౌరవమున్నా కాదనక శశిని ఉద్యోగంలో చేర్పించు!' మోహన్ స్థిరంగా అన్నాడు.

'సరే! నీ యిష్టప్రకారమే కానీ!' మధు చివరికి అంగీకరించాడు.

'గుడీవినింగ్ శశికళాదేవీ!' నవ్వుతూ విష్ చేశాడు క్రిష్ణమోహన్.

'గుడీవినింగ్!' ఎప్పుడూ అంత హాయిగా నవ్వుతూ తనతో మాట్లాడని అతని ఈనాటి కొత్త ప్రవర్తనకు కొద్దిగా ఆశ్చర్యపోతూ జవాబిచ్చింది శశికళ.

"ఏమిటో విశేషాలు?' ఉత్సాహానికి కారణమేమిటన్న కుతూహలం తొంగిచూస్తుండగా తిరిగి శశికళే ప్రశ్నించింది.

'విశేషాలా? చెప్పనా? ఇవాళ ఎండ ఎక్కువగా వుంది. నిన్న రాత్రి అదేదో సభవాళ్లు అక్కడెక్కడో ఎవరికో సన్మానం చేశార్ట! లారీ క్రిందపడి నిన్న సాయంత్రం ఓ కుక్కపిల్ల..."

"చాలండీ బాబూ! బావున్నాయి మీ వార్తలు... ఇంతకూ చదువుతున్నది?..." వస్తున్న నవ్వు దాచుకుంటూ అంది శశి.

'చదువుతున్నది క్రిష్ణమోహన్' మాట పూర్తి చేసి తాను నవ్వాడు క్రిష్ణమోహన్.

అంతలోనే గంభీరమైన ముఖభావాలతో ఎటోచూస్తూ కూర్చున్న శశికళను చూసి వులికిపడ్డాడు.

'నిజంగా విశేషం వుంది చెప్పనా శశీ?'

ఏమిటన్నట్టు చూసింది శశికళ.

"మునిసిపల్ గర్ల్స్ హైస్కూల్లో సైన్సు టీచర్ పోస్ట్ వేకెన్సీ వుందట! ఎవరన్నయినా తెలిసినవాళ్ళుంటే చెప్పమంది హెడ్‌మిస్ట్రెస్. వెడతావా ఏం?' తమాషాగా అడిగినట్టు అడిగాడు.

అలాగా అన్నట్టు క్షణకాలం విస్ఫారిత నేత్రాలతో చూసి అంతలో కళ్ళు వాల్చివేస్తూ 'నేను చేస్తానంటే మాత్రం అన్నయ్య పంపించద్దూ?' అంది శశికళ.

"మధు నీమాట ఎప్పుడు కాదన్నాడు గనుక శశీ? నిజంగా నీకు జాబ్ చేయాలని వుంటే చెప్పు! నేను చూసుకుంటా మిగతా విషయాలన్నీ! ఏం? అడగనా మధుని?' అవకాశం పోనివ్వకుండా అడిగేశాడు మోహన్.

అంగీకారం చూపులతోనే వెలిబుచ్చింది శశి.

తన అభిప్రాయం అమలులోనికి ఇంత సులభంగా వస్తుందనుకోని మోహన్ ఆశ్చర్యానందాలతో తబ్బిబ్బు పడ్డాడు.

X X X

'ఇలాటివాళ్ళంతా ఉద్యోగాలకు ఎందుకేడవాలి? ఇంట్లోనే పడి చావరాదూ? పనిచేతకాని తద్దినాలంతా నా నెత్తినెక్కి వూరేగడానికి తగలబడతారు. ఎందుకు జీతాలిచ్చి నీలాటి వాళ్లను పెట్టుకోవడం డబ్బు దండగ!'

తిట్టినంతసేపు తిట్టి విసురుగా వెళ్ళిపోయింది హెచ్.ఎం. శశికళ ఏడుస్తున్న సరోజ దగ్గరికి వెళ్ళి ఉద్రేకంతో 'ఇన్ని మాటలు పడుతూ ఎందుకీ ఉద్యోగంచేస్తావు సరోజా? ఛఛ! ఇదే నేనయితే ఈ క్షణాన రాజీనామా ఆవిడ ముఖాన కొట్టిపోదును.'

సరోజ తలెత్తి చూసింది శశికళ ముఖంలోకి విచారంగా.

'నిజమే! మీరయితే రిజైనిచ్చి వెళ్ళిపోతారు, డబ్బున్నవారు కాబట్టి! మీరలావెళ్తే పువ్వుల్లోపెట్టి చూసుకునే వారున్నారు గనుక అలా ధీమాగా అనగలిగారు. కానీ నేను... నా ఉద్యోగమే మా కుటుంబానికి ఆధారం! ఇది వదిలేస్తే తమ్ముడి చదువేం కావాలి? మంచంమీద వున్న మా అమ్మగతి ఏమిటి? పక్షవాతం వచ్చిన మానాన్న ఎంత కుమిలిపోతాడు? అందుకే... ఎంత కష్టమనిపించినా అంత మందిని కష్టపెట్టలేక ఉద్యోగం చేస్తున్నా!" మధ్యమధ్య వెక్కిళ్ళతోనే తన పరిస్థితిని వివరించింది శశికళ.

శశికళ మారు మాట్లాడలేకపోయింది. ఆరోజంతా సరోజ మాటలే ఆమె మనసులో మెదులుతున్నాయి. 'అవును నిజమే! తనమాట కాదనని అన్నయ్య, ఉద్యోగం చేయలేకపోయినా ఇబ్బందిలేని ఆర్థికస్థితి వుంది గనుకనే తనంత ధీమాగా తిరస్కారాన్ని సహించలేనని అనగలిగింది!' అనుకుంది తనలో తానే.

X X X

"అసలు డ్రస్‌మీద శ్రద్ధ తీసుకోరేం మీరు?" మనసులో మాట నిష్కల్మషంగా అడిగేసింది శశికళ.

వనజ ముఖం విషాద మేఘావృతమయింది. లోతుకుపోయినకళ్ళూ, గుంతలుపడిన చెక్కిళ్ళూ, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ చుట్టూవున్న ప్రపంచంతో సంబంధమే లేనట్టుంటుంది వనజ.

"శశీ! మాట!' శశి దగ్గర కాస్త చొరవతీసుకున్న రాధిక చెయ్యిపట్టుకొని లాక్కుపోయింది దూరంగా.

"అబ్బ! చెయ్యి విరిగిపోతూంది, ఏం మాటో చెప్పు ముందు" చెయ్యి విడిపించుకుంటూ అడిగింది శశి.

"నీ మొహం మాట! లేకపోతే ఏమిటలా పిచ్చి మొద్దులా వెళ్ళి ఆవిడ నలాటి ప్రశ్నలేస్తున్నావు?" రాధిక చిరుకోపంగా ప్రశ్నించింది.

"ఏం?" అమాయకంగా అంది శశి.

"అబ్బబ్బ! మరీ ముద్దరాలవే తల్లీ నీవు! వనజా వాళ్ళాయనకు టి.బి. వుంది. ఆయన ఉద్యోగంమీదే ఇన్నాళ్ళూ గడిచింది. ఇప్పుడతనిని శానిటోరియంలో చేర్పించి తప్పని సరిగా తను ఉద్యోగంలో చేరింది. ఆయన బ్రతికే ఆశ లేదంటున్నార్ట డాక్టర్స్. ఇద్దరు పిల్లలతో తానెలా బ్రతకాలన్న బెంగ సదా పీడిస్తూ వుంటే ఇంకెలా వుంటారే ఎవరయినా?" శశికళ కళ్ళలో నీళ్లు తిరిగాయి. "ఛ! పాపం ఎంత బాధపడిందో ఆవిడ!" నొచ్చుకుంటూ అంది.

"ఇది మరీ బావుంది! విన్నంత మాత్రానికే కన్నీళ్ళు పెట్టుకుంటున్నావా? మరీ ఇంత బేల హృదయం పనికిరాదు తల్లీ!" రాధిక ప్రేమగా శశికళ బుగ్గలు గిల్లింది నవ్వుతూ.

X X X

"హలో! ఏమిటండీ చాల బిజీగా వున్నట్టున్నారు?" కూనిరాగంతీస్తూ డాబా పిట్టగోడ దగ్గర నిలబడి స్కెచ్ వేస్తున్న శశికళ వులిక్కిపడి వెనుదిరిగి చూసింది.

క్రిష్ణమోహన్ నవ్వుతూ నిలబడ్డాడు.

"రండి! కూర్చోండి!" మందహాస వదనంతో కుర్చీ చూపింది శశికళ.

"చిత్రలేఖనంలో కూడా ప్రవేశంవుందా తమకు?" ఆవిడచేతిలోని కాగితం వైపు చూస్తూ అడిగాడు మోహన్.

"అచ్చంగా వనజ అడిగినట్టే అడిగారు! ఎటొచ్చి ఆవిడ నాకు నాట్యం వచ్చు ననుకుందిట. మీరు అన్ని కళలలోనూ ఆరితేరినదాన్ననుకుంటునట్టున్నారు!" మెత్తగా నవ్వుతూ అంది శశికళ.

"ఇంతకీ మీ సరోజ ఉద్యోగం మానేసిందా?" క్రిష్ణమోహన్ అడిగాడు. ఆరోజు వుదంతం ఇంటికి రాగానే అతనితో చెప్పింది శశి.

"లేదు! చెప్పానుగా ఆ అమ్మాయి పరిస్థితులు!' జాలిగా అంది శశికళ. 'నాలా తనకీ పువ్వుల్లో పెట్టి చూసుకునే వారుంటే మానేసేదిట!"

'అయితే మీ అన్నయ్య నిన్ను పువ్వుల్లో పెట్టి పెంచుతున్నా డంటావా?' మోహన్ కవ్వించాడు.

'కాదామరి? ఇంతమాత్రం ఏ అన్నయ్యలు ఏ తల్లిదండ్రులు చూచుకుంటారు? సరోజను చూసి అనుకుంటాను మధువంటి అన్నయ్య వుండడం నా అదృష్టమని..." సాలోచనగా అంది శశికళ. తృప్తిగా తల పంకించాడు క్రిష్ణమోహన్.

'శశీ! ఏం చేస్తున్నావమ్మా? ఇంకా ఇవాళ వీణ ప్రాక్టీసు చేసుకోలేదా?" మధు వస్తూ అడిగాడు.

"వీణనా? అదెప్పటినుండి? అసలు శశికి వీణ వాయించడం వచ్చునా?" ఆశ్చర్యంగా అడిగాడు మోహన్.

"బావుంది! నాలుగేళ్ళు నేర్చుకుందది! ఆ మధ్య ఇంట్రెస్ట్‌లేదంటూ మూలన పెట్టేసింది" ఇప్పుడేం బుద్ధి కుదిరిందో నాలుగురోజుల బట్టీ రోజూ ఓ గంట సాధన చేస్తూంది. శశిపూర్తిగా మారిపోయింది.' మధు నవ్వుతూ అన్నాడు.

'ఇదంతా నీ ఉపాయమేనోయ్ మోహన్' ఏం బహుమతి కావాలో కోరుకోమరి!' స్నేహితుడి నడిగాడు ఒక రోజు. 'మాటిచ్చి తప్పవు కదా?' సందేహం వెలిబుచ్చాడు మోహన్. 'లేదులే! అడుగు' అభయప్రదానం చేశాడు మధు. 'అయితే మీ రాకుమార్తె కావాలి నాకు!' మోహన్ నిర్భయంగా అడిగేశాడు.

X X X

"శశీ... వచ్చే ఏడాది ఏం చేస్తావు?"

'అంటే?' శశి ఎదురుప్రశ్న' వేసింది.

'అంటే వచ్చే సంవత్సంకూడా ఉద్యోగం చేస్తావా? అని'

'ఏమో! అన్నయ్య ఏం చేయమంటే అది చేస్తా! అన్నీ అన్న ఇష్టమే!' శశి పెంకెగా అంది.

'అయితే దారినపోయే దానయ్యను తెచ్చి కట్టబెడతానన్నా ఒప్పుకుంటావా?

'మీరొప్పుకుంటే నేనూ ఒప్పుకుంటాను!' నవ్వు దాచుకుంటూ అంది శశి!

'నా శశిని మరొకరి కివ్వగలనా? శశి లేకుండా నేను బ్రతకగలనా?' ఆమె భుజాలు పట్టి తనవైపు తిప్పుకుని ఉద్వేగంతో అన్నాడు మోహన్.

'మీ నీడలో వుండగా నాకే అశాంతీ వుండదు! మీ ప్రేమ నర్థం చేసుకోగలిగీ గౌరవించనందుకు సిగ్గుపడుతున్నాను. నన్ను క్షమించరూ?' కన్నీళ్ళతో తలవంచుకుని ప్రార్థించింది శశికళ.

"పిచ్చి శశీ! ప్రపంచమంటే తెలియని పసితనంతో ఏదో బాధపడ్డావు! కనీసం ఇప్పుడయినా జ్ఞాపకం పెట్టుకో శశీ! సంతృప్తికన్న శాంతిలేదు!" ఆప్యాయంగా శశి తల నిమిరాడు మోహన్.

**సాహితీ మాస పత్రిక**

తేది : డిసెంబరు 1967, జనవరి 1968